సాక్షి
వనపర్తి


శనివారం । 20 । సెప్టెంబర్ । 2025



పల్లెగడ్డకు కష్టం రానివ్వను

పల్లెగడ్డ గ్రామస్తులు ఇళ్లు ఖాళీ చేయాలని దేవాదాయశాఖ అధికారులు నోటీసులు ఇవ్వడం సరికాదని ఎంపీ డీకే అరుణ అన్నారు.

-IIలో ▸



జూరాలకు భారీగా వరద

జూరాల జలాశయానికి శుక్రవారం ఎగువ నుంచి 2.36 లక్షల క్యూసెక్కుల వరద చేరినట్లు అధికారులు వివరించారు.

-IIలో ▸

గరిష్ఠం/కనిష్ఠం
32.6/23.4

వాతావరణం

ఆకాశం సాధారణంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత కాస్త కనిపిస్తుంది. అప్పుడప్పుడు మేఘావృతం అవుతుంది.

న్యూస్‌రీల్

భూ సేకరణకు రైతులు సహకరించాలి

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని గణప సముద్రం రిజర్వాయర్ నిర్మాణానికి రైతులు సహకరించాలని ఇరిగేషన్ డీఈ నరేందర్‌రెడ్డి శుక్రవారం కోరారు. మొత్తం 603 ఎకరాల భూమి సేకరించాల్సి ఉండగా.. ఇప్పటి వరకు పూర్తిగా మునిగిపోయే భూమిని అప్పగించేందుకు 388 మంది రైతులు స్వచ్ఛందంగా అంగీకరించగా ఎకరాకు రూ.12.60 లక్షల పరిహారం త్వరలోనే ప్రభుత్వం అందిస్తుందని పేర్కొన్నారు. అదేవిధంగా బండ్ డౌన్‌స్ట్రీమ్ భాగం కోసం సేకరించిన 18 ఎకరాలకు సంబంధించి రైతులు అంగీకరించడంతో వారికి పరిహారం చెల్లిస్తున్నట్లు చెప్పారు. రిజర్వాయర్ పూర్తిస్థాయిలో నిండిన సమయంలో మునిగే భూముల రైతులు 197 మంది భూమి ఇచ్చేందుకు అంగీకరించడం లేదని.. వారు కూడా సహకరిస్తే తగిన పరిహారం ప్రభుత్వం ఇస్తుందన్నారు. రిజర్వాయర్ నిర్మాణం త్వరగా పూర్తిచేస్తే యాసంగి పంటలకు సాగునీరు అందించేందుకు వీలుంటుందని తెలిపారు. రైతులు ఏమైనా సమస్యలు, సందేహాలుంటే ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని.. ఆయన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వివరించి పరిష్కరించేందుకు కృషి చేస్తారని పేర్కొన్నారు.

నిండుకుండలా రామన్‌పాడు జలాశయం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో శుక్రవారం పూర్తిస్థాయి నీటిమట్టం సముద్ర మట్టానికిపైన 1,021 అడుగులు ఉన్నట్లు ఏఈ వరప్రసాద్ తెలిపారు. జూరాల ఎడమ కాల్వ నుంచి 1,030 క్యూసెక్కుల వరద జలాశయానికి చేరుతుండగా.. సమాంతర కాల్వలో నీటి సరఫరా లేదన్నారు. ఇదిలా ఉండగా జలాశయం నుంచి ఎన్టీఆర్ కాల్వకు 872 క్యూసెక్కులు, వివిధ ఎత్తిపోతల పథకాలకు 875, తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కుల నీటిని వినియోగించినట్లు వివరించారు.

సీనియర్ సివిల్ న్యాయమూర్తి పూజలు



కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి సమీపంలో ఉన్న దత్తకోటి లింగేశ్వరస్వామి ఆలయాన్ని శుక్రవారం జిల్లా సీనియర్ సివిల్ న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి వి.రజని దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన న్యాయమూర్తికి ఆలయ నిర్వాహకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అంతకుముందు ధ్యానమందిరంలో ఉన్న పాదరస సహిత పంచలోహ శివలింగానికి అభిషేకించి దర్శనం చేసుకున్నారు.

డీఈఈటీ యాప్‌పై విద్యార్థులకు అవగాహన



వనపర్తిటౌన్: జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం డీఈఈటీ యాప్ రిజిస్ట్రేషన్, వినియోగంపై కో–ఆర్డినేటర్ ఎస్.స్వామి, టీఎస్‌కేసీ ఎఫ్‌టీఎం కె.నాగేంద్రాచారి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల ప్రిన్సిపాల్ డా. బి.ఈశ్వరయ్య మాట్లాడుతూ.. డీఈఈటీ (డిజిటల్ ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ) ఆధునిక ప్లాట్‌ఫాం ద్వారా విద్యార్థులు తమ నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలన్నారు. ఉద్యోగ అవకాశాలు పొందడానికి ఈ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడా క్యాలెండర్‌ను ఆవిష్కరించిన వీసీ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పీయూ పరిధిలో 2025–26 విద్యాసంవత్సంలో జరిగే వివిధ క్రీడలకు సంబంధించిన వార్షిక క్యాలెండర్‌ను వీసీ శ్రీనివాస్ శుక్రవారం పీయూ అడ్మినిస్ట్రేషన్ భవనంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ నెలల్లో నిర్వహించే క్రీడల వివరాలతో క్రీడా క్యాలెండర్ రూపొందించామని, దీని వల్ల ఎంతో ప్రయోజనం ఉంటుందన్నారు. ఆయా తేదీల ఆధారంగా విద్యార్థులకు క్రీడలకు సిద్ధం అయ్యేందుకు ఆస్కారం ఉందన్నారు. విద్యార్థులు క్రీడల్లో చురుకుగా పాల్గొడం వల్ల శారీరక, మానసిక ఎదుగుదల ఉంటుందని, భవిష్యత్‌లో ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉందన్నారు. రిజిస్ట్రార్ రమేష్‌బాబు, ఆడిట్ సెల్ డైరెక్టర్ చంద్రకిరణ్, కంట్రోలర్ ప్రవీణ, ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి, పీడీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గ్రౌండింగ్ 64%   ప్రోగ్రెస్ 62%

ఇదీ 'ఇందిరమ్మ' ఇళ్ల ప్రగతి

- ఉమ్మడిజిల్లా వ్యాప్తంగా నత్తనడకన నిర్మాణాలు
- పనుల పురోగతిలో మహబూబ్‌నగర్ ఫస్ట్..
- చివరి స్థానంలో వనపర్తి జిల్లా
- మార్కింగ్ పూర్తయినా.. ముందుకు రాని లబ్ధిదారులు

పేదలకు గూడు కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఆశించిన పురోగతి కానరావడం లేదు. పథకం ప్రారంభమై సుమారు ఏడాదిన్నర కాలం గడిచినా.. జిల్లాలో ఇళ్ల నిర్మాణాలు నత్తనడకన కొనసాగుతున్నాయి. హౌసింగ్, రెవెన్యూ అధికారులతో కలెక్టర్లు నిత్యం సమీక్షిస్తున్నా.. ప్రగతిపై ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నా.. స్వయంగా పలు ప్రాంతాల్లో పర్యటించి పరిశీలనలు చేస్తున్నా.. వేగం పుంజుకోవడం లేదు. ఇంటి నిర్మాణ సామగ్రి ధరలు భగ్గుమంటుండగా.. లబ్ధిదారులు ఆర్థిక ఇబ్బందులతో వెనుకంజ వేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇందిరమ్మ ఇళ్ల ప్రగతిపై 'సాక్షి' ప్రోగ్రెస్ రిపోర్ట్..

– సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్


ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ నారాయణపేట జిల్లా మరికల్‌కు చెందిన కృష్ణమ్మ. రెండు నెలల క్రితం ఈమెకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా.. పనులు ప్రారంభించింది. ఓ వైపు ఇసుక



కొరత.. మరోవైపు పెరిగిన స్టీల్, సిమెంట్ ధరలతో ఇంటి నిర్మాణం ఎలా పూర్తి చేయాలని ఆందోళన వ్యక్తం చేస్తుంది. ప్రస్తుతం పునాది వరకు పూర్తయ్యింది. పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రభుత్వం సైతం సాయం పెంచాలని, మిగతా బిల్లులు విడుదల చేస్తేనే పనులు ఇంటి నిర్మాణ పనులు ముందుకు సాగుతాయని పేర్కొంది.



పాన్‌గల్ మండలం మాధవరావుపల్లిలో ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న అధికారులు



ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల ప్రగతి వివరాలు..

జిల్లా	మంజూరు	మార్కింగ్/ గ్రౌండింగ్	దశల వారీగా నిర్మాణాల పురోగతి			
			బేస్‌మెంట్	రూఫ్	ఆర్సీ	పూర్తి
మహబూబ్‌నగర్	10,516	6,891	4,243	1,197	399	3
నాగర్‌కర్నూల్	10,530	6,653	3,738	559	142	1
జోగుళాంబ గద్వాల	6,973	4,213	2,012	221	106	0
నారాయణపేట	6,182	4,361	2,069	281	104	2
వనపర్తి	6,203	3,781	1,424	286	227	5
మొత్తం	40,404	25,899	13,486	2,544	978	11

అధికంగా బేస్‌మెంట్ దశలోనే..

ఉమ్మడి పాలమూరులోని మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, నారాయణపేట, జోగుళాంబ గద్వాల, వనపర్తి జిల్లాల్లో మొత్తం 40,404 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. ఇందులో అధికారులు 25,899 ఇళ్లకు మార్కింగ్ (గ్రౌండింగ్ పూర్తి) చేశారు. వీటిలో అత్యధికంగా 13,486 ఇళ్లు బేస్‌మెంట్.. 2,544 ఇళ్లు గోడలు, రూఫ్ లెవల్‌లో.. 978 ఇళ్ల పనులు స్లాబ్ దశలో కొనసాగుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో ఇప్పటివరకు 11 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు మాత్రమే పూర్తయ్యాయి. మహబూబ్‌నగర్ జిల్లాకు సంబంధించి దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని మూసాపేట, మీనబోయినపల్లి, జడ్చర్ల మండలం మల్లెపల్లి గ్రామంలో ఒక్కొక్కటి చొప్పున మూడు ఇళ్ల నిర్మాణాలు పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. వనపర్తి జిల్లాలో ఐదు, నారాయణపేట జిల్లాల్లో రెండు, నాగర్ కర్నూల్ జిల్లాలో ఒక ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తయినట్లు తెలుస్తోంది.

అట్టడుగున వనపర్తి..

ఉమ్మడి జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్.. అంటే మంజూరైన వాటిలో మార్కింగ్/గ్రౌండింగ్ చేసిన వాటికి సంబంధించి శాతాలను పోలిస్తే నారాయణపేట జిల్లా మొదటిస్థానంలో ఉంది. ఆ తర్వాత స్థానాల్లో వరుసగా మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి.. చివరగా గద్వాల జిల్లా నిలిచింది.



వనపర్తి మండలం కడుకుంట్లలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇల్లు

గ్రౌండింగ్ అయిన వాటిలో వివిధ దశల్లో కొనసాగుతున్న నిర్మాణాలకు సంబంధించి పనుల పురోగతిలో ఇప్పటివరకు మహబూబ్‌నగర్ జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. ఆ తర్వాత నాగర్‌కర్నూల్, నారాయణపేట, గద్వాల జిల్లాలు నిలవగా.. వనపర్తి జిల్లా అట్టడుగున ఉంది.

- ఉమ్మడి జిల్లాలో 25,899 ఇళ్లకు మార్కింగ్ పూర్తి కాగా.. 17,019 వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. ఇంకా 8,880 మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను మొదలుపెట్టలేదు. భవన నిర్మాణ సామగ్రి అయిన సిమెంట్, ఇసుక, ఇటుక, స్టీల్ ధరలు అమాంతంగా పెరగడంతో అధిక శాతం మంది ఇళ్ల నిర్మాణాలకు ముందుకు రావడం లేదని తెలుస్తోంది.

కారణాలు ఇవే..

- పలు ప్రాంతాల్లో ఇసుక సమస్యగా మారడంతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో జాప్యం జరుగుతోంది. ఇందిరమ్మ ఇళ్లకు నామమాత్రపు చార్జీలతో ఇసుక సరఫరా చేస్తున్నామని చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో ఒక్కో ట్రాక్టర్‌కు రూ.4 వేల నుంచి రూ.4,500 చెల్లించాల్సి వస్తోందని లబ్ధిదారులు వాపోతున్నారు. మహబూబ్‌నగర్, వనపర్తి, నారాయణపేట జిల్లాలోని పలు మండలాల్లో ఈ పరిస్థితి నెలకొనగా.. లబ్ధిదారులు ఇళ్లు కట్టుకునేందుకు వెనుకంజ వేస్తున్నారు.

- ఇందిరమ్మ ఇళ్లకు మొత్తం ఐదు దశల్లో నిర్మాణాలు పూర్తయిన మేర రూ.5 లక్షలను ప్రభుత్వం అందజేస్తోంది. పథకం ప్రారంభమైన తొలినాళ్లలో ప్రొసీడింగ్‌లు అందుకుని బేస్‌మెంట్ వరకు ఇళ్లు నిర్మించుకున్నారు. చాలా రోజుల వరకు ఖాతాల్లో డబ్బులు పడకపోవడంతో పలువురు నిర్మాణాలు నిలిపివేశారు. ప్రస్తుతం బేస్‌మెంట్ వరకు నిర్మించిన వారికి రూ.లక్ష చొప్పున బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నారు. అయితే రెండో, మూడో బిల్లులు చెల్లింపుల్లో జాప్యమవుతున్నట్లు సమాచారం.

డబ్బులు సరిపోవడం లేదు



ఇందిరమ్మ ఇంటికి దరఖాస్తు చేసుకోగా మాకు ఇల్లు మంజూరైంది. అయితే ప్రభుత్వం నుంచి రూ.5లక్షలు మంజూరు చేస్తామన్నారు. ఇక్కడ రేట్లు పెరగడంతో ఇల్లు కట్టుకోలేక పోతున్నాం. ఇసుక, సిమెంట్, సీకుల ధరలు పెరగడంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం మార్కెట్ రేటు ప్రకారం ఇందిరమ్మ ఇళ్లకు డబ్బులు పెంచాలి.

– హోటల్ పార్వతమ్మ, ఇర్కిచేడు, కేటీదొడ్డి మండలం, గద్వాల జిల్లా

ధరలు పెరిగాయి.. భారంగా మారింది...



ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసింది. నిర్మాణానికి అయ్యే ఖర్చులో కొంతభాగం ప్రభుత్వం అందించడం చాలా సంతోషంగా ఉంది. బేస్‌మెంట్ వరకు పూర్తి చేస్తే రూ.లక్ష బిల్లు వచ్చింది. కానీ ఇసుక, సిమెంట్, ఇటుక, కంకర, స్టీల్ ధరలు బాగా పెరగడంతో నిర్మాణం భారంగా మారింది. ఇసుక ఉచితంగా, స్టీల్, సిమెంట్, కంకర, ఇటుక తక్కువ ధరకు అందిస్తే బాగుంటుంది.

– చింతకాల గౌతమి, కడుకుంట్ల (వనపర్తి)

నాలుగు నెలలైనా బిల్లు రాలేదు..



ప్రభుత్వం మాకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసింది. డబ్బులు లేకపోయినా అప్పు చేసి బేస్‌మెంట్ వరకు నిర్మించుకున్నాం. అధికారులు ఫొటో, వివరాలు తీసుకొని మూడు నెలలు అయింది. ఇప్పటివరకు బేస్‌మెంట్ బిల్లు రూ.లక్ష రాలేదు. చేతిలో చిల్లి గవ్వలేక ఇంటి నిర్మాణాన్ని ఆపేశాం.

– ఆలేటి ఎల్లమ్మ,
గట్టురాయిపాకుల, నాగర్‌కర్నూల్ జిల్లా

ఆధార్‌కార్డుల్లో తప్పులతో ఇబ్బంది

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాం. జిల్లాలో ఇప్పటివరకు 4,103 మంది లబ్ధిదారుల ఖాతాల్లో మొత్తం రూ.42.84 కోట్లు జమ చేశాం. ఆధార్‌కార్డుల్లో తప్పులతో పలువురికి సమస్యలు తలెత్తగా.. పరిష్కారానికి కృషి చేస్తున్నాం. జీఎస్టీ రేట్లు తగ్గనున్న నేపథ్యంలో ఇప్పటివరకు దూరంగా ఉన్న లబ్ధిదారులు ముందుకు వచ్చే అవకాశం ఉంది.

– వైద్యం భాస్కర్,
గృహనిర్మాణశాఖ పీడీ, మహబూబ్‌నగర్

తల్లిదండ్రులు గర్వించేస్థాయికి ఎదగాలి

- ఎస్పీ రావుల గిరిధర్



మాట్లాడుతున్న ఎస్పీ రావుల గిరిధర్

కొత్తకోట రూరల్: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ కష్టపడి చదివి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, మాతృభూమికి మంచి పేరు తీసుకురావడంతో పాటు ప్రజలకు సేవలు అందించేలా ఎదగాలని ఎస్పీ రావుల గిరిధర్ ఆకాంక్షించారు. నిబద్ధత, కఠోర సాధన, ప్రణాళికబద్ధంగా చదివితే కలలను సాకారం చేసుకోవచ్చని సూచించారు. శుక్రవారం పెద్దమందడి ప్రాథమిక పాఠశాలలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పలువురు అందించిన నగదుతో తరగతి గదులు, పాఠశాల గోడలపై పిల్లల్ని ఆకర్షించేలా పాఠ్యాంశాలకు సంబంధించిన చిత్రాలు, శాస్త్రవేత్తల చిత్రాలు గీయించారు. వాటిని ఆయన తిలకించడంతో పాటు విద్యార్థులకు బూట్లు పంపిణీ చేశారు. అంతకుముందు పాఠశాలకు వచ్చిన ఎస్పీకి విద్యార్థులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ.. తరగతి గదిలోనే ఉజ్వల భవిష్యత్ ఉందని, ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకోవడానికి సరైన వసతులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యేవని, ప్రస్తుతం మౌలిక వసతులు కల్పించి నాణ్యమైన విద్య అందిస్తున్నారని తెలిపారు. విద్యార్థులు మంచి పుస్తకం, మంచి స్నేహితుడిని ఎంచుకుంటే చాలా సాధించవచ్చన్నారు. ప్రముఖులు, విద్యావంతులు, అధికారులు చాలావరకు ప్రభుత్వ పాఠశాలలో చదివి వచ్చినవారేనని తెలిపారు. విజయం సాధించిన వారి జీవితాలను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. అనంతరం సహకరించిన యువత, ప్రధానోపాధ్యాయుడిని ఎస్పీ శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ మంజులత, ఎస్ఐ శివకుమార్, ఏసీటీఓ ప్రసన్నరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు బండి శ్రీనివాసులు, ఉపాధ్యాయులు జికే శ్రీనివాస్, రోజారాణి, కిరణ్‌కుమార్, సుచిత్ర, ఈశ్వర్, మధు పాల్గొన్నారు.

అన్నదాన కార్యక్రమం ప్రారంభించిన ఎస్పీ..

వనపర్తి: బీఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక గాంధీచౌక్‌లో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని శుక్రవారం ఎస్పీ రావుల గిరిధర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మిలాద్ ఉన్ నబి శాంతి, సౌభ్రాతృత్వానికి ప్రతీకగా భావిస్తారన్నారు. ప్రజలంతా ఐక్యత, స్నేహభావంతో మెలగాలని సూచించారు. ఈ నెల 5న మిలాద్ ఉన్ నబి, అదే రోజు గణేష్ నిమజ్జనం ఉన్నందున ముస్లింలు గొప్ప ఔదార్యాన్ని చాటుతూ అన్నదాన కార్యక్రమాన్ని శుక్రవారానికి మార్చుకోవడం హర్షణీయమన్నా రు. కార్యక్రమంలో ఎండీ బాబా, చాంద్‌పాషా, ఎండీ గౌస్, ఎండీ ఆరీఫ్, సుల్తాన్, మహబూబ్ పాషా, నవాజ్. ఫయాజ్. సోహెల్, సమీర్, రిజ్వాన్, రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

భూ సర్వే వేగవంతం చేయాలి



చిట్యాల శివారులోని పారాబాయిల్డ్ రైస్‌మిల్లును తనిఖీ చేస్తున్న రెవెన్యూ అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, అధికారులు

రెవెన్యూ అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

వనపర్తి: భూ రికార్డులు పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు సర్వేయర్లు భూ సర్వే వేగవంతంగా పూర్తి చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్. ఖీమ్యానాయక్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జిల్లాలోని వివిధ మండలాల సర్వేయర్లతో భూ సర్వే, భూ సమస్యల పరిష్కారంపై నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ఎఫ్–లైన్ దరఖాస్తులను నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలన్నారు. అసైన్డ్, భూ దానం, ప్రభుత్వ భూములకు సంబంధించిన ఏఐ మ్యాపింగ్ పనులు పూర్తి చేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ దరఖాస్తులను వెంటనే పరిశీలించాలని సూచించారు. సర్వే పనులు సకాలంలో పూర్తి చేయడంతోనే రికార్డుల నిర్వహణ మరింత పారదర్శకంగా, సమర్థవంతమవుతుందన్నారు. సమావేశంలో ఏడీ సర్వే ల్యాండ్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నిర్దేశిత సమయానికి పంట కోతలు చేపట్టాలి..

కోత యంత్రాల నిర్వాహకులు వానాకాలం వరి కోతల్లో అధికారుల సూచనలు పాటించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సంబంధిత శాఖల అధికారులతో పాటు కోత యంత్రాల నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పంటలు పచ్చిగా ఉన్నప్పుడే కోతలు చేపడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతుల నుంచి వరి ధాన్యం కొనుగోలు చేయాలంటే ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉండాలని, తేమ శాతం కీలకమన్నారు. సమావేశంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, డీఎస్ఓ కాశీవిశ్వనాథం, పౌరసరఫరాలశాఖ డీఎం జగన్మోహన్, డీటీఓ మానస తదితరులు పాల్గొన్నారు.

గడువులోగా సీఎంఆర్ అప్పగించాలి..

2024–25 యాసంగికి సంబంధించిన సీఎంఆర్ గడువులోగా ఎఫ్‌సీఐకి అప్పగించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ ఆదేశించారు. శుక్రవారం వనపర్తి మండలం చిట్యాల శివారులోని పారాబాయిల్డ్ రైస్‌మిల్లును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధాన్యం నిల్వలు, మిల్లింగ్ సామర్థ్యం, ఇప్పటి వరకు సరఫరా చేసిన బియ్యం వివరాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. సీఎంఆర్ ప్రక్రియలో జాప్యం జరిగితే ప్రభుత్వానికి ఆర్థికంగా నష్టం వాటిల్లుతోందని తెలిపారు. సకాలంలో సీఎంఆర్ అప్పగించేందుకు ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని.. మిల్లర్లు కూడా తమవంతు కృషి చేయాలని కోరారు.

ఆగని అన్నదాతల ఆందోళన



పాన్‌గల్‌లో ప్రధాన రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు

పాన్‌గల్: వ్యవసాయ పనులు నిలిపివేసి రోజుల తరబడి యూరియా కోసం సింగిల్‌విండో కార్యాలయానికి తిరుగుతున్న లభించకపోవడంతో ఆగ్రహించిన రైతులు శుక్రవారం పాన్‌గల్‌లోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట వనపర్తి–కొల్లాపూర్ ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. వారికి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దేవేందర్, సీపీఎం మండల కార్యదర్శి బాల్యానాయక్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వీరసాగర్ మద్దతు ప్రకటించి మాట్లాడారు. అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతోనే యూరియా కష్టాలు వచ్చాయని.. ప్రభుత్వం ముందస్తు ప్రణాళిక లేకపోవడంతోనే పడిగాపులు పడాల్సిన దుస్థితి నెలకొందని తెలిపారు. రైతులకు యూరియా సరఫరా చేసే వరకు ఆందోళన విరమించేది లేదన్నారు. రాస్తారోకోతో రహదారిపై వాహనాలు గంటకు పైగా నిలిచిపోయాయి. ఎస్ఐ శ్రీనివాస్, తహసీల్దార్ సత్యనారాయణరెడ్డి, సీఈఓ భాస్కర్‌గౌడ్, ఇన్‌చార్జ్ ఏఓ డాకేశ్వర్‌గౌడ్ అక్కడికి చేరుకొని మాట్లాడారు. ఇప్పటి వరకు సింగిల్‌విండో ద్వారా 21 వేల బస్తాలు, ప్రైవేట్ దుకాణాల ద్వారా 14 వేల బస్తాల యూరియా పంపిణీ చేశామని, ఇంకా 1,500 బస్తాలు వస్తుందని, రాగానే టోకన్లు పొందిన రైతులకు అందజేస్తామని, ఆందోళన చెందవద్దని చెప్పడంతో రైతులు రాస్తారోకో విరమించారు.

యూరియా అక్రమంగా తరలిస్తున్నారంటూ..



పీఏసీఎస్ సీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కొత్తకోట రూరల్: రైతులు యూరియా కోసం తెల్లవారుజామున వచ్చి వరుసలో నిలబడి పడిగాపులు పడుతుంటే.. వారికి ఇవ్వకుండా రాత్రిళ్లు అక్రమంగా తరలిస్తున్నారంటూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని పీఏసీఎస్ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, సీడీసీ మాజీ చైర్మన్ చెన్నకేశవరెడ్డి మాట్లాడుతూ.. వర్షాకాలం పంటలు ముగింపు దశకు చేరుతున్న సమయంలోనూ రైతులకు సరిపడా యూరియా అందించకపోవడంతో ఉద్రిక్తత నెలకొంటుందని, కొందరు నాయకులు తమ పలుకుబడిని ఉపయోగించుకొని రాత్రిళ్లు అక్రమంగా తరలించుకుపోతున్నారని మండిపడ్డారు. యూరియాను రైతులకు సరఫరా చేయాలని, అక్రమంగా తరించుకుపోతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పీఏసీఎస్ సీఈఓ బాలరాజుకు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో మాజీ వైస్ ఎంపీపీ గుంత మల్లేష్, సర్పంచుల సంఘం మాజీ మండల అధ్యక్షుడు ఆకుల శ్రీనివాసులు, మాజీ కౌన్సిలర్ చీర్ల నాగన్నసాగర్, వహీద్, రాంచందర్, జనార్దన్ తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

వనపర్తి రూరల్: మరమ్మతుల కారణంగా శనివారం జిల్లాకేంద్రంలో 33 కేవీ అన్ని ఫీడర్లకు ఉదయం 8 నుంచి 10.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో డీఈ శ్రీనివాసులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇదే సమయంలో కర్నూలు రోడ్‌లో కొత్తగా 11 కేవీ లైన్ ఏబీ స్విచ్చులు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. పట్టణం, రూరల్ గ్రామాలు, పాన్‌గల్, గోపాల్‌పేట, ఏదుల, రేవల్లి, పెద్దమందడి, ఖిల్లాఘనపురం, కొత్తకోట మండలాల్లోని పలు గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని.. గృహ, వ్యాపార, పరిశ్రమలు, వ్యవసాయ వినియోగదారులు సహకరించాలని కోరారు.

క్లుప్తంగా

లారీ, బైక్ ఢీకొని యువకుడి దుర్మరణం


మృతుడు రాజేశ్

జడ్చర్ల: లారీని వెనుక నుంచి మోటార్ బైక్ ఢీకొట్టిన ప్రమాదంలో బైక్ నడుపుతున్న యువకుడు అక్కడికక్కడే దుర్మరణం చెందిన ఘటన శుక్రవారం తెల్లవారుజామున 4 గంటలకు జడ్చర్ల వద్ద 44వ నంబర్ జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. స్థానిక సీఐ కమలాకర్ కథనం మేరకు.. బాలానగర్ మండలం పెద్దబాయితండాకు చెందిన సారావత్ రాజేశ్ (22) సెంట్రింగ్ పనులు చేస్తూ ఉపాధి పొందుతున్నాడు. పనుల నిమిత్తం ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపూర్ జిల్లా ధర్మవరం పట్టణానికి వెళ్లిన రాజేష్ తిరిగి శుక్రవారం ఉదయం 4 గంటలకు బస్సులో జడ్చర్ల కొత్తబస్టాండ్‌లో దిగాడు. అక్కడి నుంచి మోటార్ బైక్‌పై స్వగ్రామానికి పయనమయ్యాడు. కావేరమ్మపేట వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ముందు వెళుతున్న లారీ ఆకస్మికంగా బ్రేక్ వేయడంతో వెనుకే మోటార్ బైక్‌పై వేగంగా వస్తున్న రాజేష్ లారీని ఢీకొట్టాడు. దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తల్లి సారావత్ అరుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మృతుడి వద్ద నగదు స్వాధీనం

రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే సమాచారం అందుకున్న జడ్చర్ల 108 అంబులెన్స్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకున్నారు. అయితే అప్పటికే రాజేష్ మృతి చెందడంతో అతడి బ్యాగులో ఉన్న రూ.47,930 నగదును గుర్తించిన అంబులెన్స్ సిబ్బంది శివారెడ్డి, మల్లేశ్వర్ పోలీసుల సమక్షంలో బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో జైలు శిక్ష

వెల్దండ: మండల కేంద్రంలోని హైదరాబాద్ శ్రీశైలం జాతీయ రహదారిపై చేపట్టిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలో చారకొండ మండలం చంద్రాయన్‌పల్లి గ్రామానికి చెందిన అప్పిసు శ్రీను పట్టుబడ్డాడని ఎస్‌ఐ కురుమూర్తి తెలిపారు. శుక్రవారం కల్వకుర్తి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి కావ్య నిందితుడికి ఒకరోజు జైలు శిక్షతో పాటు రూ.600 జరిమానా విధించారు.

వంగూరులో..

వంగూరు: డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన సేవ్యానాయక్‌ను కోర్టులో హాజరపర్చగా రూ.600 జరిమాన, రెండు రోజుల జైలుశిక్ష కోర్టు విధించినట్లు ఎస్‌ఐ మహేష్ తెలిపారు.

కల్వకుర్తిలో..

కల్వకుర్తి టౌన్: కర్నూల్ జిల్లా కుందాముర్ మండలం పోలకుర్తికి చెందిన ఉప్పరి రాజు, వంగూర్ మండలం కోనాపూర్ గ్రామానికి చెందిన నకినమోని రాజులు డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడినట్లు ఎస్‌ఐ మాధవరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వారిని కల్వకుర్తి కోర్టులో హాజరుపర్చగా జూనియర్ సివిల్ జడ్జి కావ్య ఉప్పరిరాజుకు ఒకరోజు జైలుశిక్షతో పాటు రూ. 600 జరిమానా, నకిన మోని రాజుకు ఒకరోజు జైలుశిక్షతో పాటు రూ.100 జరిమానా విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ముగ్గురిపై కేసు నమోదు

లింగాల: మండలంలోని చెన్నంపల్లికి చెందిన వివాహిత బండారి నాగమణిపై వేధింపులకు పాల్పడిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్‌గౌడ్ శుక్రవారం తెలిపారు. భర్త బండారి రామకృష్ణ, అత్త చెన్నమ్మ, ఆడపడుచు శారద నాగమణిని మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురి చేస్తున్నారని ఎస్‌ఐ తెలిపారు. ఈ నెల 6న భర్త బాధితురాలిపై కర్ర, ఇటుకలతో దాడి చేసి గాయపర్చినట్లు ఎస్‌ఐ తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పల్లెగడ్డకు ఏ కష్టం రానివ్వను


పల్లెగడ్డ ప్రజలతో మాట్లాడుతున్న మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ

- గ్రామస్తులు అధికారుల నోటీసులకు భయపడొద్దు
- మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ

మరికల్: వందల ఏళ్ల నుంచి స్థిర నివాసం ఏర్పాటు చేసుకొని ఉంటున్న పల్లెగడ్డ ప్రజలకు ఏ కష్టం రానివ్వనని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ భరోసానిచ్చారు. శుక్రవారం ఆమె గ్రామాన్ని సందర్శించగా.. దేవాదాయశాఖ నోటీసులతో ఆందోళనలో ఉన్న బాధిత గ్రామస్తులు ఆమెను చుట్టుముట్టి తమ గోడు వినిపించారు. ఇళ్లు ఖాళీ చేసి వెళ్లిపోవాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారని వివరించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ.. ఏళ్ల నుంచి ఇక్కడ ఇళ్లు నిర్మించుకొని ఉండటమే కాకుండా ప్రభుత్వం అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందని, ప్రత్యేక గ్రామపంచాయతీ కూడా ఏర్పాటు చేసిందని చెప్పారు. ఇప్పుడు దేవదాయశాఖ అధికారులు నోటీసులు ఇచ్చి ఊరునే ఖాళీ చేసి పోవాలని ఇరకాటంలో పెట్టడం సరికాదన్నారు. రూ.లక్షలు వెచ్చించి ఇళ్లు నిర్మించుకుంటుంటే ఇన్నాళ్లు అధికారులు నిద్రపోయారా అని ప్రశ్నించారు. చిన్నరాజమూరు ఆంజనేయస్వామి పేరుతో పల్లెగడ్డ గ్రామాన్ని ఖాళీ చేయాలని నోటీసులు ఇస్తే మాత్రం ఊరుకోమన్నారు. గ్రామకంఠం కింద 20 ఎకరాల భూమి కూడా ఉందని.. ఈ విషయాన్ని అధికారులు గుర్తించాలని కోరారు. గ్రామస్తులను కోర్టు కేసుల పేరుతో వేధించడం సరికాదని.. దేవాదాయశాఖ ఉన్నతాధికారులు ఈ విషయంపై పునరాలోచించాలన్నారు. గ్రామస్తులు ఎవరూ భయపడొద్దని.. దేవాదాయశాఖ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం మండలంలోని వివిధ సమస్యలపై ఎంపీకి వినతి పత్రాలు అందజేశారు. ఆమె వెంట పార్టీ జిల్లా అధ్యక్షుడు సత్యయాదవ్, రతంగ్‌పాండురెడ్డి, నర్సన్‌గౌడ్, తిరుపతిరెడ్డి, వేణు, భాస్కర్‌రెడ్డి, రాజేష్, రమేష్, కుర్మయ్య, శ్రీరామ్, తిరుపతయ్య, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జూరాలకు 2.36 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

- ప్రాజెక్టు 27 క్రస్టు గేట్ల ఎత్తివేత
- 2.15 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు


జూరాల ప్రాజెక్టు నుంచి 27 క్రస్టు గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న వరద

ధరూరు/ఆత్మకూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో భారీగా పెరిగినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. గురువారం ప్రాజెక్టుకు 1.88 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా... శనివారం రాత్రి 8 గంటల వరకు 2.36 లక్షల క్యూసెక్కులకు పెరిగినట్లు అధికారులు వెల్లడించారు. దీంతో ప్రాజెక్టు 27 క్రస్టు గేట్లు ఎత్తి 1.83 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. విద్యుదుద్పత్తికి 29,540 క్యూసెక్కులు, నెట్టెంపాడుకు 750 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 66 క్యూసెక్కులు, భీమా లిఫ్టు-1కు 650 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 1,030 క్యూసెక్కులు, కుడి కాల్వకు 540 క్యూసెక్కులు, భీమా లిఫ్టు-2కు 750 క్యూసెక్కులు కలిపి ప్రాజెక్టు నుంచి మొత్తం 2.15 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 7.933 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

సుంకేసులకు 20 వేల క్యూసెక్కులు

రాజోళి: సుంకేసుల డ్యాంకు ఎగువ నుంచి శుక్రవారం 20,250 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. మూడు గేట్లు ఒక మీటర్ మేర తెరిచి 15,602 క్యూసెక్కుల నీటిని దిగువకు, కేసీ కెనాల్ 2,445 క్యూసెక్కులు వదిలినట్లు జేఈ మహేంద్ర తెలిపారు.

కొనసాగుతున్న విద్యుదుత్పత్తి

శుక్రవారం జూరాల ప్రాజెక్టులో ఎగువలో 6 యూనిట్ల ద్వారా 234 మెగావాట్లు, దిగువలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్లు విద్యుదుత్పత్తి చేపట్టినట్లు ఎస్ఈ శ్రీధర్ తెలిపారు. ఎగువ, దిగువ జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో ఇప్పటివరకు 715.982 ఎంయూ విజయవంతంగా విద్యుదుత్పత్తిని చేపట్టారు.

ప్రజల కోసమే బతికిన సురవరం


మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శివర్గ సభ్యుడు వెంకట్‌రెడ్డి

నాగర్‌కర్నూల్ రూరల్: అంతరాలు లేని సమాజ నిర్మాణమే సురవరం సుధాకర్‌రెడ్డికి మనమిచ్చే నివాళని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక సాయి గార్డెన్‌లో నిర్వహించిన సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. సుధాకర్‌రెడ్డి జీవితమంతా ప్రజల కోసమే బతికాడన్నారు. అంతరాలు లేని సమాజం రావాలని, డబ్బు, కులం, ప్రాంతం, హోదా, మతం ఇవేవి మనుషుల మధ్య విభజన రేఖలు గీయడానికి వీలు లేదన్నారు. ఎర్ర జెండా నీడలో పీడిత ప్రజల సమస్యల విముక్తికి అహర్నిశలు పోరాడిన మహనీయుడు సుధాకర్‌రెడ్డి అని కొనియాడారు. దేశంలో కమ్యూనిస్టు ఉద్యమం చీలిక తర్వాత కమ్యూనిస్టు పార్టీలు బలహీనపడుతూ వస్తున్నాయని, అది దేశ ప్రగతికి అత్యంత ప్రమాదకరమన్నారు. భూర్జువ ప్రభుత్వాలను గద్దె దించాలంటే కమ్యూనిస్టు పార్టీలన్ని ఏకం కావాలని సుధాకర్‌రెడ్డి కలలు కన్నారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా సురవరం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజా నాట్య మండలి, కళాకారులు ప్రదర్శన గేయాలతో సభను అలరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాలనర్సింహ్మా, ఫయాజ్, సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు సురవరం కపిల్, ఆనంద్ , వెంకటయ్య, కేశవగౌడ్, నర్సింహ్మా, చంద్రమౌలి, విజయుడు పాల్గొన్నారు.

కబేళాలకు తరలిస్తున్న ఆవుల పట్టివేత

- కేసు నమోదు

ఊర్కొండ: కబేళాలకు తరలిస్తున్న ఆవులు, కోడె దూడలను పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేసిన ఘటన మండలంలో శుక్రవారం జరిగింది. ఏఎస్‌ఐ ఆంజనేయులు తెలిపిన వివరాలు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మన్యం జిల్లా నుంచి కంటైనరలో హైదరాబాద్‌కు తరలిస్తున్న 25 ఆవులు, 46 కోడెదూడలను మండల పరిధిలోని ఇప్పపాడు శివారులో పట్టుకున్నట్లు తెలిపారు. పశువుల్లో కొన్నింటికి తీవ్ర గాయాలు కాగా, మరికొన్ని అపస్మారక స్థితిలోకి వెళ్లాయన్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న కల్వకుర్తి సీఐ నాగార్జున మండల పశు వైద్యాధికారి రాజేష్ ఆధ్వర్యంలో పశువులకు వైద్య పరీక్షలు చేయించారు. అనంతరం పశువులను కల్వకుర్తి మండలం రాయచూర్‌లోని గోశాలకు, కంటైనర్‌ను ఊర్కొండ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కంటైనర్ డ్రైవర్ హర్యానాకు చెందిన షకీల్, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన దుర్గ లవరాజు, అప్పలరాజుపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ పేర్కొన్నారు.

జోగుళాం ఉత్సవాలకు మంత్రులకు ఆహ్వానం


మంత్రికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఈఓ, చైర్మన్


మంత్రి జూపల్లికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఈఓ, చైర్మన్

అలంపూర్: జోగుళాంబ అమ్మవారి దసర నవరాత్రి ఉత్సవాలకు మంత్రి కొండా సురేఖను ఆలయ కమిటీ ఆహ్వానించినట్లు తెలిపారు. హైదరాబాద్ సచివాలయంలో దేవాదాయ, అటవీ-పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి, దేవాదాయ శాఖ కమిషనర్ శైలజ రామయ్యర్‌ను ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ అలంపూర్ ఆలయ కమిటీ చైర్మన్ నాగేశ్వర్ రెడ్డి, ఈఓ దీప్తి ఆలయ ధర్మకర్తలతో కలిసి శుక్రవారం నవరాత్రి ఉత్సవాలకు ఆహ్వానించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అర్చకులు మంత్రులను శాలువాతో సత్కరించి అమ్మవారి ప్రసాదాలను అందజేసినట్లు తెలిపారు. ఈనెల 22వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు జోగుళాంబ అమ్మవారి ఆలయంలో దేవీశరన్న నవరాత్రి ఉత్సవాలు జరగనున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాలకు హాజరు కావాలని ఆహ్వాన పత్రిక అందజేసినట్లు తెలిపారు. వీరితోపాటు గద్వాల ఇన్‌చార్జి సరిత, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుమల్, ఆలయ ధర్మకర్తలు సరస్వతి, నాగశిరోమణి, పులేందర్, జయరాముడు, చంద్రశేఖర్‌రెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, గోపాల్, అడ్డాకుల రాము, జగన్‌గౌడ్, జగన్ మోహన్‌నాయుడు తదితరులు ఉన్నారు. అదేవిధంగా ఏఐసీసీ కార్యదర్శి మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ ఆయన సతిమణి మహాలక్ష్మిని ఆలయ కమిటీ చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి, ధర్మకర్తలు వారి నివాసంలో కలిసినట్లు తెలిపారు. దసరా నవరాత్రి ఉత్సవాలకు హాజరుకావాలని ఆహ్వాన పత్రిక అందజేసినట్లు తెలిపారు.

నేడు జోగుళాంబ ఆలయం పవిత్రోత్సవం

అలంపూర్: అలంపూర్ క్షేత్రంలో వెలిసిన జోగుళాంబ ఆలయంలో ఈనెల 20వ తేదీన పవిత్రోత్సవం, శుద్ధి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఈఓ దీప్తి, కమిటీ చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 22వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు దేవీశరన్న నవరాత్రి ఉత్సవాలు ఉన్న నేపథ్యంలో శుద్ధి కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. శనివారం మధ్యాహ్నం 1గంట నుంచి అమ్మవారి ఆలయ తలుపులు మూసి శుద్ధి, పవిత్రోత్సవం చేపడుతున్నట్లు తెలిపారు. మధ్యా హ్నం నుంచి సాయంత్రం వరకు జోగుళాంబ అమ్మవారి ఆలయంలో భక్తుల దర్శనాలు తాత్కాలికంగా నిలిపివేయనున్నట్లు తెలిపా రు. తిరిగి సాయంత్రం 6:30 గంటలకు అమ్మ వారి ఆలయంలో భక్తుల దర్శనాలు కొనసాగనున్నట్లు తెలిపారు. భక్తులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయంలో దర్శనా లు యథావిధిగా కొనసాగుతాయని తెలిపారు.

'సింగోటం' లింకు కెనాల్ పూర్తిచేయాలి


మాట్లాడుతున్న రాచాల యుగంధర్‌గౌడ్

బీసీ పొలిటికల్ జేఏసీ స్టేట్ చైర్మన్ యుగంధర్‌గౌడ్

కొల్లాపూర్: దశాబ్దాల కాలంగా కొల్లాపూర్‌లో ఆశించిన రీతిలో అభివృద్ధి జరగలేదని, ఇప్పటికీ అదే పరిస్థితులు కొనసాగడం దారుణమని బీసీ పొలిటికల్ జేఏసీ స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. అసంపూర్తిగా ఉన్న సింగోటం-గోపల్‌దిన్నె లింకు కెనాల్ పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. అనంతరం కొల్లాపూర్‌లో విలేకరులతో మాట్లాడారు. 2018లో లింకు కెనాల్ నిర్మాణానికి మంత్రి జూపల్లి కృష్ణారావు నిధులు మంజూరు చేయించారని, ఆ పనులను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి చెందిన రాఘవ కంపెనీ దక్కించుకుందని వివరించారు. 35వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరందించే కెనాల్ పనులను ఇప్పటివరకు పూర్తిచేయకపోవడం బాధాకరమన్నారు. జూపల్లి, పొంగులేటి వల్లనే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని ఓవైపు ప్రచారం జరుగుతుంటే.. మరోవైపు నిధుల లేమీ కారణంగా కొల్లాపూర్‌లో అభివృద్ధి పనులు జరగకపోవడం ఏమిటో అర్థం కావడం లేదన్నారు. జూపల్లి అనుకుంటే కెనాల్ పనులు ఎప్పుడో పూర్తయి ఉండేవన్నారు. రూ.150 కోట్లు ఖర్చు చేస్తే కెనాల్ పూర్తవుతుందన్నారు. రెండు నెలల్లో కెనాల్ పనులకు సంబంధించి భూసేకరణ ప్రక్రియ పూర్తి చేయాలని, నిర్వాసితులకు పరిహారం ఇవ్వాలని లేనిపక్షంలో బీసీ పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో పాదయాత్ర చేపడతామని వెల్లడించారు. కొల్లాపూర్‌లో చాలా కార్యాలయాలకు సొంత భవనాలు లేవని, పబ్లిక్ టాయిలెట్లు లేక మహిళలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అభివృద్ధిని పక్కనబెట్టి నాయకులు వర్గ రాజకీయాలకే ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. దీనిపై తాను మంత్రి, మాజీ ఎమ్మెల్యేలతో చర్చించేందుకు సిద్ధమనన్నారు. వచ్చే ఎన్నికల్లో బీసీ అభ్యర్థిని ఎమ్మెల్యేగా గెలిపించేందుకు తాము కృషిచేస్తామన్నారు. సమావేశంలో జేఏసీ రాష్ట్ర కార్యదర్శి వీపీ.గౌడ్, జిల్లా అధ్యక్షుడు అరవింద్‌చారి, నియోజకవర్గ కన్వీనర్ యశ్వంత్, నాయకులు స్వామి, వీరేందర్, దేవర శివ, అంజన్న యాదవ్, మహేందర్, నరేందర్‌సాగర్, గౌతం శంకర్‌గౌడ్, రాఘవేంద్ర తదితరులున్నారు.

నిజాముద్దీన్ మృతదేహాన్ని ఇండియాకు రప్పించాలి



జిల్లా కేంద్రంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్న ముస్లిం సంఘాల ప్రతినిధులు

పాలమూరు: అమెరికాలో పోలీసుల కాల్పుల్లో మృతిచెందిన మహ్మద్ నిజాముద్దీన్ మృతదేహాన్ని భారత్‌కు రప్పించాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం నిజాముద్దీన్ తండ్రిని ప్రజా సంఘాల నాయకులు పట్టణంలోని వీకేరెడ్డి కాలనీలోని నివాసంలో పరామర్శించారు. ఈ సందర్భంగా పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ రాఘవాచారి, బీఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖలీల్ మాట్లాడుతూ.. అమెరికా ప్రభుత్వంతోపాటు ఇటూ కేంద్ర ప్రభుత్వం మృతి చెందిన యువకుడి కుటుంబ సభ్యులకు సమాచారం చెప్పకపోవడంలో తీవ్ర నిర్లక్ష్యం చేశారన్నారు. సోషల్‌మీడియా ద్వారా కొడుకు మరణ వార్త తెలుసుకోవడం బాధాకరమన్నారు. భారత ఎంబీసీ ఒక భారతీయుడు చనిపోయినా పట్టించుకోకపోవడం వారి పనివిధానానికి నిదర్శనమన్నారు. అమెరికాలో ఎన్నారైలు అనేక సంస్థలు నడుపుతున్నా.. దేశం నుంచి వెళ్లిన శ్రామికుల గురించి మాట్లాడే సంస్థలు లేకపోవడం బాధాకరమన్నారు. నిజాముద్దీన్ మృతదేహం వెంటనే కుటుంబ సభ్యులకు అప్పగించే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిపాదికన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు వామన్‌కుమార్, హనీఫ్ అహ్మద్, ఇక్బాల్ పాల్గొన్నారు.

ముస్లిం సంఘాల కొవ్వొత్తుల ప్రదర్శన

స్టేషన్ మహబూబ్‌నగర్: ప్రజా, ముస్లిం సంఘాల ప్రతినిధులు జిల్లా కేంద్రంలోని క్లాక్‌టవర్‌లో శుక్రవారం రాత్రి కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టి నిజాముద్దీన్‌కు నివాళులర్పించారు. ప్రజాప్రతినిధులు ఏకమై రాష్ట్ర ముఖ్యమంత్రి ద్వారా కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి నిజాముద్దీన్ మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పజెప్పేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బైత్ అల్‌ఖైర్ అధ్యక్షులు మహ్మద్ తఖీ, ఆమిర్ సోహైల్, ఆల్‌మేవా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారుఖ్ హుస్సేన్, ప్రధాన కార్యదర్శి వహీద్‌షాతోపాటు సంఘాల ప్రతినిధులు ఎండీ రషీద్, అబ్దుల్ ఖలీల్, మహ్మద్ వహేద్, ఆయా పార్టీల నాయకులు మహ్మద్ మొయిజ్, ఉబేద్ తదితరులు పాల్గొన్నారు.

కలవరపరిచే వయ్యారిభామ


పంటలను నష్టపరిచే వయ్యారిభామ కలుపుమొక్క

పాడి-పంట
జిల్లా వ్యవసాయాధికారి, సక్రియానాయక్

అలంపూర్: పంట ఏదైనా రైతును ముందుగా కలవరపెట్టే కలుపు మొక్క వయ్యారి బామ. దీనిని పార్థీనియం, ముక్కుముల్లు, క్యారెట్ గడ్డి లేదా తిక్క అలుము అని కూడా పిలుస్తారని జిల్లా వ్యవసాయశాఖ అధికారి సక్రియ నాయక్ తెలిపారు. దీని పూర్తి పేరు పార్థీనియం హిస్టిరోఫోరస్. నేల ఏదైనా రైతుకు మాత్రం కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. 1960లో అమెరికా నుంచి దిగుమతి చేసుకున్న గోధుమల వెంబడి ఇది మన దేశానికి వచ్చింది. అనతి కాలంలోనే ఈ కలుపు మొక్క దేశమంతా వ్యాప్తి చెందింది. లక్షలాది ఎకరాల్లో పంటను నష్టం కలిగిస్తోంది. ఈ క్రమంలో ఈ మొక్క గురించి రైతులు అవగాహన పెంచుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వివరించారు.

పార్థీనియం మొక్క వివరాలు

పార్థీనియం మొక్క 90రోజులు జీవిస్తోంది. 1నుంచి 1.5 మీటర్ల ఎత్తు వరకు పెరుగుతోంది. 40 నుంచి 60 రోజుల్లో పూతకు వస్తోంది. ఒక్కొక్క మొక్క 40 వేల గింజలను ఉత్పత్తి చేస్తోంది. ఒక్కొక్క మొక్క 3వేల మిలియన్ల పుప్పొడిని ఒక్కొక్క చదరపు మీటరుకు ఉత్పత్తి చేస్తోంది. దీని కాలంతో పని లేదు. ఎప్పుడైనా మొలకెత్తుతుంది. ఎప్పుడైనా పూతకు వస్తోంది. పంట పొలాల్లో గట్ల వెంట, రోడ్ల పక్కల, కాల్వల వద్ద, ఖాళీ స్థలాల్లో కాస్త స్థలం దొరికితే చాలు ఇట్టే మొలకెత్తుతుంది. పంటలు లేని పొలాల్లో దీని ఉధృతి మరి ఎక్కువగా ఉంటుంది.

ఏం చేస్తోంది!

వయ్యారి భామ మొక్కతో అనారోగ్య సమస్యలు కలుగుతాయి. వాటిని చేతులతో తొలగించినా, తాకినా, తగటబెట్టే సమయంలో దగ్గరగా ఉంటే దురుద వస్తోంది. దీని పూలలో పార్థీన్ అనే విషకారకం ఉండటం వల్ల శ్వాసకోస సంబంధమైన వ్యాధులు, అలర్జీ, ఎగ్జిమా, చర్మ సంబంధిత వ్యాధులు వ్యాపిస్తాయి. ఈ పార్థీనిన్ మొక్కలలో ఫలదీకరణ జరగకుండా అడ్డుపడుతుంది.

పంటలకు నష్టం

ఈ మొక్క యొక్క పూలు వైరస్ క్రిములకు ఆశ్రయం ఇస్తాయి. పంటలు లేని సమయంలో ఈ వైరస్ క్రిములు పార్థీనియం పూలలో స్థావరం ఏర్పరుచుకొని ఉంటాయి. పంట కాలంలో తెల్లదోమ, తామర పురుగులు, పేను బంక, పచ్చ దోమ పురుగులు ఈ పూల నుంచి వైరస్‌ను పంటలకు వ్యాప్తి చేస్తాయి. పంటలకు వచ్చే వైరస్ తెగుళ్లు బడ్ నెక్రోసిస్, జెమిని వైరస్, కుకుంబర్ మొజాయిక్ వైరస్, మొవ్వ కుళ్లు వైరస్ దీని ద్వారా వ్యాప్తి చెందుతాయి.

నివారణ

పంటలను, మనుషుల ఆరోగ్యాన్ని నష్టపరిచే వయ్యారి బాను ఒక్క రైతు నివారించ లేడు. రైతులు అందరు సాముహికంగా ఒకే రోజు మొక్కల నివారణకు కలిసి రావాలి. దీని నివారణకు ఉప్పును 50 గ్రాములు 1 లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకుంటే పూత రాకుండా అరికడుతుంది. చిన్న మొక్కలుగా ఉన్నప్పుడు గ్లైఫోసేట్ 10 మిల్లి లీటర్లు, 10 గ్రాముల యూరియా లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. మొక్కలపై పారాక్వాట్ అనే మందును 5 మి.లీ లీటరు నీటికి కలుపుకోని పిచికారీ చేసుకోవాలి. రైతులు ముఖ్యంగా పార్థీనియం చెట్టు పూతకు రాక ముందే దీనిని తొలగించాలి. పూత వచ్చిన తర్వాత విత్తనాలు నేలపై పడి మళ్లీ మొలకెత్తుతాయి.

సమర్థవంతంగా విధులు నిర్వహించాలి


బెటాలియన్‌లో రిక్రియేషన్ హాల్‌ను ప్రారంభిస్తున్న అదనపు డీజీపీ సంజయ్‌కుమార్‌జైన్

అదనపు డీజీపీ సంజయ్‌కుమార్‌జైన్

ఎర్రవల్లి: పోలీస్ సిబ్బంది విధి నిర్వహణలో సమర్థవంతంగా పని చేయాలని రాష్ట్ర పోలీస్ బెటాలియన్ అదనపు డీజీపీ సంజయ్‌కుమార్‌జైన్ అన్నారు. శుక్రవారం మండల పరిశాలోని బీచుపల్లి పదో బెటాలియన్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీ తోట శ్రీనివాసరావు, బెటాలియన్ ఇన్‌చార్జ్ కమాండెంట్ జయరాజు అదనపు డీజీపీకి బొకే అందించారు. సిబ్బంది కవాతులో ఘన స్వాగతం పలికారు. అనంతరం పటాలంలో సిబ్బంది వెల్ఫేర్ కోసం నిర్మించిన రిక్రియేషన్ హాల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు డీజీపీ మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా పోలీస్ సిబ్బంది ముందడుగు వేయాలన్నారు. వృత్తిలో సిబ్బంది ఎదుర్కొంటున్న సవాళ్లను తెలుసుకొని వాటి పరిష్కారానికి పలు సూచనలు, సలహాలు అందజేశారు. బెటాలియన్ ప్రధాన కార్యాలయం, పోలీస్ పరేడ్ మైదానం, ఆయుధ కేంద్రం, ఆపరేషన్ ప్లాటూన్, భవన వసతులు, రోడ్లు, సీటీవసతి, పార్కు, వాహనాల సామర్థ్యం వంటి వాటిని సందర్శించి సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. బెటాలియన్‌లో పోలీస్ సంక్షేమ కార్యక్రమాల వివరాలను తెలుసుకొని రుణాల విషయంలో సిబ్బందికి సహకరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పటాలం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దేవుడు ఆవహించాడంటూ బావిలో దూకి వ్యక్తి మృతి

ఉండవెల్లి: దేవుడు ఆవహించాడంటూ బావిలో దూకి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని కంచుపాడులో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బోయ చిన్న చెన్నయ్య అలియాస్ గిడ్డన్న (62) మొహర్రం పండుగకు పీర్లు ఎత్తుకొని బావిలో వేసేవాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి మద్యం మత్తులో నన్ను దేవుడు ఆవహించాడంటూ గట్టిగా అరుస్తూ పీర్ల బావిలో దూకాడు. వెంటనే బావి పక్కన ఉన్న హోటల్‌లో ఉన్న వేణుగోపాల్ అనే వ్యక్తి కాపాడి బయటకు తీశాడు. మరలా బావిలో దూకాడు. ఎంతకు తిరిగి రాకపోవడంతో వేణుగోపాల్ గిడ్డన్న కుమారుడు పరుశరాముడికి సమాచారం అందజేయగా ఇద్దరు కలిసి బావి నుంచి బయటకు తీశారు. అప్పటికే గిడ్డన్న మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శేఖర్ పేర్కొన్నారు.

కారు, ట్రాక్టర్ ఢీ: ఐదుగురికి గాయాలు

- రెండుగా విడిపోయిన ట్రాక్టర్
- కారుకు బెలూన్ తెరుచుకోవడంతో తప్పిన ప్రమాదం


దాసర్‌పల్లి స్టేజీ సమీపంలో ప్రమాదానికి గురైన కారు, ట్రాక్టర్

మక్తల్: కారు, ట్రాక్టర్ ఢీకొని ఐదుగురికి గాయాలైన ఘటన మండలంలోని దాసర్‌పల్లి స్టేజీ సమీపంలోని ఓ దాబా వద్ద శుక్రవారం ఉదయం 6 గంటలకు చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. మక్తల్ మండలంలోని దాసర్‌పల్లికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ అంజనేయులు ఇటుక తెచ్చేందుకు వెళ్తుండగా.. హైదరాబాద్‌లోని కొంపల్లికి చెందిన నలుగురు కర్ణాటకలోని కొక్కి సుబ్రమణ్యస్వామి దర్శించుకొని తిరుగు ప్రయాణంలో ఉండగా వారి కారు ఎదురుగా ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. దీంతో ట్రాక్టర్ రెండు భాగాలుగా విడిపోయి రోడ్డుకు అడ్డంగా పడింది. కారు బెలూన్లు తెరుచుకోవడంతో అందులో ఉన్న ఉదయ్, శివ, సందీప్, వంశీకి ప్రమాదం తప్పినా.. తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స కోసం వీరిని హైదరాబాద్‌కు తరలించారు. కారు డైవర్ నిద్రమత్తులో వేగంగా నడుపడంతోనే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. ట్రాక్టర్ డ్రైవర్ అంజనేయులు ఎగిరి కింద పడి స్వల్పంగా గాయపడగా.. మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై క్షతగాత్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ భాగ్యలక్ష్మీరెడ్డి తెలిపారు.

ఆటో, లారీ ఢీకొని..

ఆటో, లారీ ఢీకొని నలుగురికి గాయాలైన ఘటన మక్తల్ మండలంలోని వడ్వాట్ స్టేజీ వద్ద శుక్రవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. దీంతో ఆటో ప్రయాణిస్తున్న అమ్మపల్లికి చెందిన రేణుకకు కాలు, చెయ్యి విరిగి పోయింది. అడవిసత్యవారం గ్రామానికి చెందిన జయంతి, చాందిబీలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం మహబూబ్‌నగర్‌కు తరలించారు. ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ భాగ్యలక్ష్మీ రెడ్డి తెలిపారు.

సాక్షి ఫ్యామిలీ IV
మహబూబ్‌నగర్
శనివారం ॥ 20-9-2025



'రోజంతా ఉత్సాహంగా ఉండడానికి, మనం ఉదయం లేవగానే చేసే పనులు కీలకపాత్ర పోషిస్తాయి. నిద్ర లేచిన కొద్దిసేపటికే నెగటివ్ థాట్స్, చేదు జ్ఞాపకాలు దూసుకు రావచ్చు. అవి మదిలో చేరిన వెంటనే డిలీట్ చేయాలి. ఇష్టమైన సంగీతం వినాలి. వ్యాయమాలు, క్రియేటివ్ వర్క్‌పై దృష్టి పెట్టాలి' అని అంటున్నాడు బ్రూక్. హార్వర్డ్ ప్రొఫెసర్ ఆర్థర్ సి.బ్రూక్‌కి హ్యాపీ సైంటిస్ట్ అని పేరు.

తొలి అడుగు





ఫస్ట్ క్లాస్ జర్నీ

కాస్త సరదాగా చెప్పుకోవాలంటే...

'నువ్వు ఎక్కవలసిన రైలు ఒక జీవితకాలం లేటు' అనే ఆరుద్ర మాట సురేఖ యాదవ్‌కు వర్తించదు.

నిజానికి రైలే ఆమెను వెదుక్కుంటూ వచ్చింది.

ఆసియా ఫస్ట్ ఉమెన్ ట్రైన్ డ్రైవర్‌గా చరిత్ర సృష్టించిన సురేఖ రిటైర్ అయింది.

ఆమె ఒక రైలుబడి. ఆ బడిలో ఎన్నో విలువైన పాఠాలు ఉన్నాయి. భావితరాలకు మార్గదర్శకాలు ఉన్నాయి.

మహారాష్ట్రలోని సతారలో పుట్టి పెరిగింది సురేఖ. అయిదుగురు పిల్లల్లో పెద్దది. తండ్రి రామచంద్ర భోంస్లే రైతు. సతారాలోని సెయింట్ పాల్ కాన్వెంట్ హైస్కూలులో చదువుకున్న సురేఖ వృత్తివిద్యా కోర్సులో చేరింది. ఆ తరువాత.. కరాడ్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఎలక్ట్రిక్ ఇంజనీరింగ్‌లో డిప్లొమా, బీఎస్సీ(మ్యాథ్స్), బీయిడీ చేసింది.

టీచర్ కాదు రైలు డ్రైవర్

బీయిడీ చేసిన సురేఖ టీచర్ కావాలనుకునేది. అయితే ఆమెకు రైల్వే డిపార్ట్‌మెంట్‌లో పనిచేసే అవకాశం వచ్చింది. ముంబైలో రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డ్ ఇంటర్వ్యూను విజయవంతంగా పూర్తి చేసుకొని సెంట్రల్ రైల్వేస్‌లో ట్రైనీ అసిస్టెంట్ డ్రైవర్‌గా చేరింది. 1985లో కల్యాణ్ ట్రైనింగ్ స్కూల్‌లో ఆరు నెలల పాటు శిక్షణ తీసుకుంది. అసిస్టెంట్ డ్రైవర్‌గా ఆమె వృత్తి ప్రయాణం మొదలైంది. వాడి బందర్, కల్యాణ్‌ల మధ్య నడిచే గూడ్స్ ట్రైన్‌లో ఇంజిన్ రన్నింగ్ కండీషన్, సిగ్నల్స్... మొదలైన వాటిని పర్యవేక్షించేది. కొన్ని సంవత్సరాల తరువాత పూర్తిస్థాయిలో గూడ్స్ డ్రైవర్‌గా బాధ్యతలు స్వీకరించింది. ఆ తరువాత వెస్ట్రన్ ఘాట్ రైల్వేస్‌లో డ్రైవర్‌గా పనిచేసింది.

■ దక్కన్ క్వీన్ డ్రైవ్ చేసిన క్వీన్

దక్కన్ క్వీన్(డైలీ పాసింజర్ ట్రైన్) డ్రైవర్‌గా పాసింజర్ ట్రైన్‌ను నడిపిన ఆసియాలోని తొలి మహిళగా గుర్తింపు పొందింది సురేఖ. ఘాట్ లైన్ కోసం రెండు–ఇంజిన్‌ల ప్యాసింజర్ ట్రైన్ నడపడానికి ప్రత్యేక శిక్షణ తీసుకుంది. గతంలో మహిళలు ఎవరూ ఘాట్ లైన్‌లో ట్రెయిన్ నడపకపోవడం వల్ల పై అధికారులకు సందేహాలు ఉండేవి. వాటిని పటాపంచలు చేస్తూ 'శభాష్' అనిపించుకుంది సురేఖ.

'దక్కన్ క్వీన్ ట్రైన్ నడపాలనేది నా కలగా ఉండేది. ఎందుకంటే మహిళ పేరుతో నడిచే రైలు అది. ఆ పేరులో రాజసం ధ్వనిస్తుంది. ఆ కల నెరవేరినందుకు సంతోషంగా ఉంది. భారతీయ రైల్వే నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు గర్వంగా ఉంది. మహిళలకు ప్రత్యేకించిన ట్రైన్స్‌ను నడపడం కూడా సంతోషంగా ఉంది' అంటుంది సురేఖ.

■ గురువుగా...

ఎక్స్‌ప్రెస్ మెయిల్ డ్రైవర్‌గా 2011లో ప్రమోట్ అయిన సురేఖ ఆ తరువాత కల్యాణ్‌లో డ్రైవర్స్ ట్రైనింగ్ సెంటర్ (డిటీసి)లో సీనియర్ ఇన్‌స్ట్రక్టర్‌గా పాఠాలు బోధించింది. మన దేశంలో ట్రైన్ నడిపిన తొలి మహిళగా గుర్తింపు తెచ్చుకున్న సురేఖ ఎంతోమంది అమ్మాయిలకు స్ఫూర్తినిచ్చింది. 2011లో 50 మంది మహిళలు సబర్బన్, గూడ్స్ ట్రైన్ డ్రైవర్లుగా ప్రయాణం మొదలుపెట్టారు. ఇలాంటి ఎంతోమంది మహిళలకు స్ఫూర్తి...సురేఖ.

■ ఆ ప్రోత్సాహమే ఉత్సాహమై...

'ఆడవాళ్ల ట్రైన్ డ్రైవర్ ఏమిటి! అని ఆశ్చర్యపోయే రోజుల్లో కూడా నా కుటుంబం, మిత్రులు, బంధువుల నుంచి ప్రోత్సాహం లభించింది. ఆ ప్రోత్సాహమే ఉత్సాహమై నన్ను ముందుకు నడిపించింది. వృత్తిజీవితంలో నాకు ఎలాంటి వివక్షా ఎదురుకాలేదు. ట్రైన్ ఎక్కిన తొలి క్షణం నుంచి మరే విషయాలు మదిలో రాకుండా ప్రశాంతంగా ఉండేలా చూసుకునేదాన్ని' అంటూ గతాన్ని గుర్తు చేసుకుంది సురేఖ.

నిజానికి ఆమె రైల్వే డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం చేస్తానని ఎప్పుడూ అనుకోలేదు. అయితే ఆ ఉద్యోగమే ఆమెను చరిత్రలో గుర్తింపు తెచ్చుకునేలా చేసింది.

కష్టం లేదు... ఎప్పుడూ ఇష్టమే!

'ట్రెయిన్ నడపడం అంటే మాటలా!'లాంటి మాటలు వినిపించినప్పటికీ నేను ఎప్పుడూ భయపడలేదు. చాలా ధైర్యంగా, ఉత్సాహంగా శిక్షణ తీసుకున్నాను. ఈ ఉద్యోగంలోకి ఎందుకు వచ్చానా అని ఎప్పుడూ అనుకోలేదు. ఉద్యోగం ఎప్పుడూ కష్టంగా అనిపించలేదు. కుటుంబ, వృత్తి బాధ్యతలను జాగ్రత్తగా సమన్వయం చేసుకునేదాన్ని.

– సురేఖ యాదవ్



ఘనమైన వీడ్కోలు

సురేఖ యాదవ్ ఫేర్‌వెల్ సెలబ్రేషన్ ముంబైలోని ఛత్రపతి శివాజీ మహరాజ్ టెర్మినస్ (సీఎస్ఎంటీ)లో ఘనంగా జరిగింది. ఎక్కడెక్కడి నుంచో వచ్చిన సురేఖ ఆత్మీయులు, స్నేహితులు, బంధువులు, రైల్వే ఉద్యోగులు ఆమె మెడలో పూలమాలలు వేశారు. డోళ్ల వాయిస్తూ నృత్యాలు చేశారు.

'సురేఖ రిటైర్ అయినప్పటికీ... ఆమెలోని శక్తి సామర్థ్యాలు రిటైర్ కావు. అవి ఎప్పుడూ ఎంతోమందికి స్ఫూర్తిని ఇస్తూనే ఉంటాయి' అన్నారు వక్తలు.

రీబూట్

స్టైల్ మార్చి సత్తా చాటింది!



వరల్డ్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్స్‌లో స్వర్ణ పతకం గెలిచి చరిత్ర సృష్టించిన జైస్మిన్ లంబోరియా ప్రయాణం నల్లేరు మీద నడకేమీ కాదు. హరియాణాకు చెందిన జైస్మిన్ కుటుంబాన్ని 'బాక్సర్‌ల కుటుంబం' అంటుంటారు. ఆమె తాత కెప్టెన్ చందర్ బ్యాన్ లంబోరియా రెజ్లర్. బాబాయ్‌లు నేషనల్ బాక్సింగ్ ఛాంపియన్స్‌గా సత్తా చాటారు. తాతల బాక్సింగ్ నైపుణ్యాల గురించి వింటూ, బాబాయ్‌ల బాక్సింగ్‌ల ప్రతిభను చూస్తూ పెరిగింది జైస్మిన్.

వారి స్ఫూర్తితో బాక్సింగ్‌లోకి అడుగు పెట్టిన జైస్మిన్ తన ఋఎత్తు కారణంగా మొదట్లో ఇబ్బంది పడింది. అపజయాలు పలకరించాయి. 'అపజయాన్ని చూసి బాధపడడం కంటే ఆడేవిధానాన్ని మార్చుకుంటే సరిపోతుంది' అని ధైర్యం చెప్పుకొని తన స్టైల్‌ను మార్చుకుంది. ఆ మార్పులలో అతిగా తొందరపడకుండా ఓపికగా ఉండడం కూడా ఒకటి. కొత్త స్టైల్‌తో బంగారు పతకం గెలుచుకుంది.

బ్రెజిల్‌లో జరిగిన 'వరల్డ్ బాక్సింగ్ కప్'కు జైస్మిన్‌ను పంపడానికి నిరాకరించిన బాక్సింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సైతం స్వర్ణపతకం గెలిచిన సందర్భంగా 'ప్రౌడ్ మూమెంట్ ఫర్ ఇండియా' అంటూ 'ఎక్స్' వేదికగా ఎక్సలెంట్ టెక్నికల్ బాక్సర్ జైస్మిన్ లంబోరియాను ప్రశంసించడం విశేషం.

వంటిల్లు

దుర్గామాత పూజలకు అన్నీ సిద్ధం అనుకునేలోపు నైవేద్యాల తయారీ ఎలా- అనే ఆందోళన తలెత్తడమూ సహజం... ఏమేం కావాలి, ఎలా రెడీ చేసుకోవాలో ముందే తెలుసుకుని, ఆచరణలో పెడితే అమ్మవారికి రుచిగా... శుచిగా నైవేద్యాలను సులువుగా సిద్ధం చేసుకోవచ్చు. ఆ వివరాలు ఈ వారం వంటిల్లులో..

అమ్మకు నైవేద్యం

పరమాన్నం



కావలసినవి: పెసరపప్పు – 1/2 కప్పు; బియ్యం – 3/4 కప్పు; పాలు – కప్పు; నీళ్లు – 4 కప్పులు; బెల్లం తరుగు – కప్పు; యాలకుల పొడి – అర టీ స్పూన్; నెయ్యి – 3 టేబుల్ స్పూన్లు; జీడిపప్పు – పది పలుకులు; కిస్‌మిస్ – గుప్పెడు.

తయారీ: ● పప్పును దోరగా వేయించుకోవాలి ● బియ్యం, పప్పు కలిపి కడగాలి ● కుకర్‌లో కడిగిన బియ్యం, పప్పు, నీళ్లు కలిపి 3 విజిల్స్ వచ్చేవరకు ఉడికించి, దించాలి ● మందపాటి గిన్నెలో బెల్లం తరుగు వేసి వేడిచేయాలి. దీంతో 3–4 నిమిషాల్లో బెల్లం పాకం సిద్ధం అవుతుంది ● కుకర్ విజిల్ వచ్చాక మూత తీసి, అన్నం మెత్తగా స్పూన్‌తో మెదుపుకోవాలి. పాలు పోసి కలపాలి ● ఫిల్టర్ పెట్టి, బెల్లం సిరప్ వడకట్టి, మెత్తగా అయిన అన్నంలో కలపాలి. తర్వాత ఈ మిశ్రమాన్ని స్టౌపై పెట్టి ఐదు నిమిషాలు ఉడికించాలి. దీంట్లో యాలకుల పొడి వేసి కలపాలి ● విడిగా మరొక మూకుడులో నెయ్యి వేడి చేసి, దాంట్లో జీడిపప్పు, కిస్‌మిస్ వేసి దోరగా వేయించాలి ● నెయ్యిలో వేయించిన జీడిపప్పు మిశ్రమంలో కలిపి, గిన్నెలోకి తీసుకోవాలి.

అల్లం గారెలు



కావలసినవి: మినప్పప్పు – కప్పు; ఉప్పు – 1/3 టీ స్పూన్ (తగినంత); వంట సోడా– చిటికెడు; పచ్చిమిర్చి తరుగు – అర టీ స్పూన్; అల్లం తరుగు – టేబుల్ స్పూన్; కరివేపాకు – 2 రెమ్మలు; మిరియాల పొడి – పావు టీ స్పూన్; నూనె – వేయించడానికి తగినంత.

తయారీ: ● మినప్పప్పు కడిగి, 3–4 గంటలసేపు నానబెట్టాలి. నీళ్లు వడకట్టి, ఉప్పు వేసి, మెత్తగా రుబ్బుకోవాలి ● రుబ్బిన పిండిలో పచ్చిమిర్చి తరుగు, ఉప్పు, మిరియాలపొడి, కరివేపాకు తరుగు వేసి కలపాలి ● స్టౌ పై కడాయి పెట్టి, గారెలు వేయించడానికి తగినంత నూనె పోసి, వేడి చేయాలి ● వేళ్లకు నీళ్లు తగిలేలా తడి చేసుకొని, పిండిని కొద్ది కొద్దిగా తీసుకొని, వేళ్లతోనే బాల్స్‌లా చేసుకోవాలి ● నూనె రాసిన ప్లాస్టిక్ షీట్‌పైన పిండి బాల్‌ను కొద్దిగా వేళ్లతో అదిమి, మధ్యలో హోల్ పెట్టాలి ● తయారు చేసుకున్న దానిని కాగుతున్న నూనెలో వేసి, రెండు వైపులా గోధుమ రంగు వచ్చే వరకు ఉంచి, బయటకు తీసి, ప్లేటులో పెట్టాలి.

కదంబం



కావలసినవి: బియ్యం – కప్పు; కందిపప్పు – అర కప్పు; చింతపండు – నిమ్మకాయ పరిమాణం; కూరగాయలు – బీరకాయ, సొరకాయ, గుమ్మడికాయ, బెండకాయ, దొండకాయ, గాజర్, బఠానీ.. మొదలైనవి – 150 గ్రాములు (చిన్న ముక్కలు); పసుపు – పావు టీ స్పూన్; ఉప్పు – తగినంత; సాంబార్ పొడి – 2 టీ స్పూన్లు; నూనె – 2 టేబుల్ స్పూన్లు; ఆవాలు – టీ స్పూన్; ఎండు మిర్చి – 2; ఇంగువు – చిటికెడు; నెయ్యి – టేబుల్ స్పూన్.

తయారీ: ● కందిపప్పు బాగా ఉడికించి, మెత్తగా మెదిపి పక్కనుంచాలి ● మరొక గిన్నెలో బియ్యం మెత్తగా ఉడికించి, వేరుగా ఉంచాలి ● ఒక గిన్నెలో కూరగాయల ముక్కలు, చింతపండు రసం, పసుపు, ఉప్పు వేసి మెత్తగా ఉడికించాలి ● ఉడికిన కూరగాయ ముక్కల్లో సాంబార్ పొడి వేసి బాగా కలపాలి ● మెత్తగా చేసిన పప్పు, అన్నం ఉడుకుతున్న కూరగాయల మిశ్రమంలో వేసి కలపాలి ● ఒక చిన్న పాన్‌లో నూనె వేసి వేడి చేసి, ఆవాలు, జీలకర, ఎండుమిర్చి, కరివేపాకు, ఇంగువ వేసిన తాలింపును వేసి కలపాలి.

● గిన్నెలోకి తీసిన తర్వాత చివరగా నెయ్యి వేయాలి.



– నారాయణమ్మ,
మీ థాట్ హోమ్ డిలైట్

● సోషల్ మీడియా



తూమక్ తూమక్

సోషల్ మీడియాలో 'తూమక్ తూమక్' అనేది వైరల్ ట్రెండ్‌గా మారింది. కర్మ అనే టీచర్ చిన్న పిల్లలతో కలిసి వేసిన 'తూమక్ డ్యాన్స్' ఆహా అనిపిస్తోంది. ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఈ వీడియోకు 21 మిలియన్‌ల వ్యూస్ వచ్చాయి.



టీచర్ వేసిన పాపులర్ ట్రెండ్ స్టెప్స్‌ను చిన్ని స్టూడెంట్స్ పర్‌ఫెక్ట్‌గా అనుసరించి 'వారేవా' అనిపించారు.

'మీరు నమ్ముతారో లేదోగానీ నేను ఈ వీడియోను వంద సార్లు చూసి ఉంటాను' అన్నాడు ఒక యూజర్.

'నా వయసు 26 సంవత్సరాలు. మీ స్కూల్‌లో విద్యార్థిగా మారవచ్చా?' అని సరదాగా అడిగింది ఒక యూజర్.

ప్లేబ్యాక్ సింగర్ నేహా బాషిన్ 'జుట్టి మేరీ' ఆల్బమ్ పాపులర్ అయింది. ఈ పాటలోని తూమక్ స్టెప్స్‌కు ఆన్‌లైన్ లోకం ఫిదా అయింది. గతవారం క్లాస్‌రూమ్‌లో చిన్న అమ్మాయి ఒకరు చక్కని హావభావాలతో వేసిన తూమక్ తూమక్ స్టెప్స్ వీడియో కూడా వైరల్ అయింది.

● నమిత

పట్టుదలే..ముందడుగు



ఢిల్లీలో మెటల్ డిజైనింగ్‌లో మాస్టర్స్ చేసిన నమిత సూరత్‌లో ఎనిమిదేళ్లు ఆభరణాలను డిజైన్ చేసింది. అయితే ఉన్నట్లుండి ఆమె విజయవంతమైన కెరీర్‌ను వదిలి హైదరాబాద్‌కు మారి సామాజిక, పారిశుధ్య సమస్యలపై అవగాహన పెంచుకొని పర్యావరణం కోసం పనిచేస్తోంది. రైల్వేలతో పాటు దేశంలో శానిటేషన్ అవసరం ఉన్న ప్రాంతాలలో బయో డైజెస్టర్ టాయిలెట్‌లను నిర్మించి పారిశుధ్య కార్మికులు, గ్రామీణ మహిళలకు వందలాది ఉద్యోగాలను సృష్టించింది. పర్యావరణం కోసం పనిచేయడానికి ఆసక్తి చూపే అనేక స్వచ్ఛంద సంస్థల కార్యకలాపాల్లో పాల్గొంది. హెల్త్ కేర్, వాటర్ అండ్ శానిటేషన్ అవార్డుతోపాటు అనేక ప్రశంసలను పొందిన నమిత బంకా కథ ఇది.

'తలపెట్టిన పనిని నూటికి నూరుపాళ్లు పూర్తిచేయడానికి కృషి చేయాలని నమ్ముతాను' అంటారు నమిత. భర్త ఉద్యోగరీత్యా హైదరాబాద్ కు బదిలీ కావడంతో ఇక్కడే సోషల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌లో వివిధ కోర్సుల్లో చేరారు. దాంట్లో భాగంగా ఇండియన్ రైల్వేలో టెండర్లు వేయడం మొదలుపెట్టారు. తనకున్న పరిచయాల ద్వారా పెద్ద సమస్యలలో ఒకటైన పారిశుధ్యం గురించి తెలుసుకుని, రైల్వేలో టాయిలెట్ తయారీదారులకు లైసెన్సింగ్ ఏజెంట్‌గా పనిచేసి, మార్కెట్ పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకున్నారు. ఆ తర్వాత తెలంగాణలోని ఎమ్ఎస్ఎమ్ఇ ఇండస్ట్రియల్ పార్క్ వద్ద శానిటేషన్ నిర్వహణ వ్యవస్థ ఏర్పరిచి, పర్యావరణ అనుకూల ఉత్పత్తుల తయారీలో రాణిస్తున్నారు. బంకా బయో ప్రైవేట్ లిమిటెడ్‌కు రూపకల్పన చేసి, దానిని సంస్థాగతంగా వెలుగులోకి తీసుకువచ్చారు.

వ్యర్థాల శుద్ధి

మన దేశంలో పారిశుధ్య సమస్యల గురించి నమిత వివరిస్తూ –''గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ చాలా మంది ప్రజలు బహిరంగంగా మలవిసర్జన చేస్తుంటారు. ఈ పద్ధతి ఆరోగ్య ప్రమాదాలను కలిగిస్తుంది. పర్యావరణ సమస్యలను పెంచుతుంది. నీటి కాలుష్యానికి దారితీస్తుంది. మేం టాయిలెట్‌ను మాత్రమే కాకుండా 'ఆన్-సైట్' వ్యర్థాల శుద్ధి సౌకర్యాన్ని కూడా అందిస్తాం. వీటి ట్యాంక్‌లో బయో–డైజెస్టర్‌లు అమర్చి ఉంటాయి. సంప్రదాయ టాయిలెట్‌లతో పోలిస్తే తక్కువ సమయంలో 99 శాతం వ్యర్థాలు కుళ్ళిపోతాయి. సంప్రదాయ సెప్టిక్ ట్యాంకులను బయో–ట్యాంకులుగా మార్చడానికి మేం కృషి చేస్తున్నాం. ఇది మెరుగైన పర్యావరణాన్ని, ఆరోగ్య పరిస్థితులను సృష్టిస్తుంది. రైలు పట్టాలను వ్యర్థ పదార్థ రహిత ట్రాక్‌లుగా మార్చడానికి భారతీయ రైల్వేలకు, కుటుంబాలకు బయో–టాయిలెట్లు, పబ్లిక్– కమ్యూనిటీ, పాఠశాలలు, సంస్థలకు బయో–టాయిలెట్లు ఏర్పాటు చేయడంతో పాటు ప్రస్తుతం ఉన్న సెప్టిక్ ట్యాంకులను బయో–ట్యాంకులుగా అప్‌గ్రేడ్ చేస్తున్నాం. సమాజంలో పారిశుధ్యం విషయంలో మహిళలు ఎదుర్కొంటున్న కఠినమైన పరిస్థితి గురించి నాకు తెలుసు. మొదట ఈ విషయంలో రైల్వే అధికారులను సంప్రదించినప్పుడు, రైళ్లలో టాయిలెట్ టెక్నాలజీలను మెరుగుపరచడంలో వారు నాతో సహకరించారు. పారిశుధ్య ప్రమాణాలను పెంచడానికి అక్కడ ఒక బలమైన అవకాశాన్ని చూశాను. తరువాత సమాజం కోసం కూడా దీనిని ఉపయోగించడం ప్రారంభించాను.

ధైర్యంతో పాటు దృఢ సంకల్పమే తోడు

కష్టాలను ఎదుర్కోవడానికి ధైర్యంతో పాటు తలపెట్టిన పని పూర్తిచేయాలనే దృఢ సంకల్పం ఉండాలి. నేను అదే చేశాను. సాంస్కృతిక అడ్డంకులెన్నో నాకు అడ్డంకిగా నిలిచాయి కానీ ఆగిపోలేదు. సమాజం పట్ల నా విధులను సక్రమంగా నిర్వర్తించాలన్న నా సంకల్పం, పారిశుధ్యం, పర్యావరణం పట్ల శ్రద్ధే నన్ను నడిపిస్తున్నాయి. ఔత్సాహిక బృందం నాతో కలిసి రావడం అదృష్టం. మొదట ముగ్గురు సభ్యులతో మొదలుపెట్టాం. 2013 చివరి నాటికి మా సంఖ్య 80కి పెరిగింది. వివిధ విభాగాలతో ఖర్చుతో కూడుకున్న పారిశుధ్య పరిష్కారాలను అందించడానికి కృషి చేస్తున్నాం. సంకల్ప్ సమ్మిట్, యాక్షన్ ఫర్ ఇండియా వంటి కార్యక్రమాలలో పాల్గొన్నాం. అక్కడి అనుభవాలు మమ్మల్ని మేము మరింతగా మెరుగుపరచుకోవడానికి సహాయపడ్డాయి. దీనికితోడు బ్యాంకు క్రెడిట్, ప్రైవేట్ రుణ నిధులు ఉండనే ఉన్నాయి. చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ కొన్ని ప్రయోజనాలను అందించింది. ఒక మహిళా వ్యవస్థాపకురాలిగా ప్రతి దశలోనూ మనల్ని మనం నిరూపించుకోవాలి. రకరకాల సామాజిక మనస్తత్వాలనూ దృష్టిలో ఉంచుకోవాలి. అప్పుడే సక్సెస్ సాధించగలుగుతాం'' అని చెప్పారు నమిత.

దేశంలో టాయిలెట్ సౌకర్యం అందుబాటులో లేని ప్రదేశాలలో బయోడైజెస్టర్ టాయిలెట్ల నిర్మాణానికి, తయారీకి, సరఫరాకు నమిత బంకా కృషి చేస్తున్నారు. దాదాపు పది మిలియన్ల మందికి ఆమె సేవలు చేరుకున్నాయి. ఇండియన్ రైల్వేస్, షాపూర్జీ పల్లోంజీ, ఎల్ అండ్ టి, వోకార్డ్ ఫౌండేషన్, తెలంగాణ, ఎ.పి ఎడ్యుకేషన్ – వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఇస్రో .. వంటివి బంకా బయోకు ఉన్న ముఖ్యమైన క్లయింట్లు. ఈ కంపెనీ ప్రతిష్ఠాత్మక సంకల్ప్ హెల్త్‌కేర్, వాటర్ అండ్ శానిటేషన్ అవార్డుతో సహా అనేక అవార్డులను గెలుచుకుంది.

● పునరాగమనం



5000 ఏళ్లనాటి ఆట తిరిగి వచ్చింది!

5000 వేల ఏళ్ల క్రితం నాటి ఆట ఒకటి తమిళనాడులో పునరాగమనం చేయడమే కాదు బాగా పాపులర్ అవుతోంది. చోళుల కాలం నాటి ఈ ఆట పేరు... ఆట్య పట్యా. శారీరక దారుఢ్యం, ఐక్యతకు అద్దం పట్టే ఈ ఆటను 'సత్రినై' అని కూడా పిలుస్తారు. తమిళ ప్రాచీన సాహిత్యంలో ఈ ఆటకు సంబంధించిన ఎన్నో విశేషాలు కనిపిస్తాయి.

పదిహేనుమందితో రెండు జట్లు ఆడే ఈ ఆట చురుకుదనం, వ్యూహం, క్రమశిక్షణకి గీటురాయిగా నిలిచింది.

పెద్దల నోటి నుంచి ఆట్య పట్య గురించి విన్న యువతరం వేల ఏళ్ల నాటి ఆటకు ప్రాణం పోశారు. తమిళనాడులోని వివిధ జిల్లాలలో యువతరమే కాదు పిల్లలు కూడా ఆట్య పట్య ఆడుతున్నారు. ఈ ఆట ఎలా ఆడాలి అనేదాని గురించి యూట్యూబ్‌లో ఎన్నో వీడియోలు ఉన్నాయి.

బులియన్
(బంగారం 10 గ్రా.: వెండి కిలో)
సెప్టెంబర్ 19న ముగింపు రూ.లలో

	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	రాజమండ్రి	ప్రొద్దుటూరు	చెన్నై
బంగారం (24 క్యారెట్లు)	1,14,410	1,13,500	1,11,330	1,13,500	1,14,050	1,11,600
బంగారం (22 క్యారెట్లు)	1,07,560	1,02,050	1,02,050	1,05,110	1,04,930	1,02,300
వెండి	1,33,500	1,33,800	1,43,000	1,33,800	1,33,300	1,43,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.